ఆత్మవిశ్వాసం నింపేందుకే క్రీడలు

పరుగు పందెంలో పాల్గొన్న దివ్యాంగులు

- దివ్యాంగుల క్రీడల ప్రారంభోత్సవంలో జిల్లా సంక్షేమాధికారి సుమ
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు
- వివిధ రకాల ఆటల్లో పాల్గొన్న 280 మంది దివ్యాంగులు

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 15 : దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకే ప్రతి సంవత్సరం వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి టి.సుమ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. తొలుత జిల్లా సంక్షేమాధికారి సుమ.. డీవైఎస్‌వో సునీల్‌కుమార్‌తో కలిసి ఆటల పోటీలను జెండాఊపి ప్రారంభించారు. క్యారమ్స్, చెస్, రన్నింగ్, షాట్‌పుట్, వీల్‌చైర్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 350 మంది దివ్యాంగులు హాజరు కాగా.. 280 మంది వివిధ రకాల క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ కనబరిచిన పలువురు దివ్యాంగులను రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా దివ్యాంగులకు క్రీడలు నిర్వహించామన్నారు. కొద్ది రోజుల్లోనే జిల్లా మంత్రులు, కలెక్టర్ అనుమతితో దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు తేదీ ప్రకటిస్తామన్నారు. అదే రోజు క్రీడల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో తరలివచ్చి క్రీడలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్‌లో పాల్గొన్న దివ్యాంగులు

దివ్యాంగులతో కలిసి చెస్ ఆడుతున్న డీడబ్ల్యూవో సుమ

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

బెలూన్లను ఎగురవేస్తున్న అదనపు కలెక్టర్

భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

ఉత్సాహభరిత వాతావరణంలో ఆటల పోటీలు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 15 : దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. స్థానిక ప్రగతి మైదానంలో జిల్లా సంక్షేమాధికారి విజేత అధ్యక్షతన నిర్వహించిన దివ్యాంగుల ఆటల పోటీలను అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆటల్లో రాణించడం వల్ల దేశవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు సంపాదించుకోవచ్చన్నారు. పారా ఒలింపిక్స్‌లో మన దేశానికి అనేక బహుమతులు వచ్చాయని, ప్రతిరోజూ క్రీడలు సాధన చేయడం వల్ల మంచి నైపుణ్యం, మెళకువలు తెలుస్తాయన్నారు. దివ్యాంగులకు మానసిక, శారీరక ఉల్లాసం కలిగేందుకు ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పోటీ ప్రపంచంలో దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఎవరూ ఏ విషయంలోనూ అధైర్యపడొద్దని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీవీఎస్ అధ్యక్షుడు సతీశ్, జగ్గుదాస్, బాలకృష్ణ, నరేందర్, ఎన్జీవో నిర్వాహకులు ప్రసాద్, క్రిషోలిక్, జ్యోతి, గౌతమి, వరప్రసాద్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

గోదాదేవికి పూజలు చేస్తున్న భక్తులు (ఫైల్)

పరమపవిత్రం.. ధనుర్మాసం..

- భగవత్‌ప్రాప్తి సర్వవ్యాప్తం కావడం కోసమే 'ధనుర్మాస వ్రతం'
- రేపటి నుంచి జనవరి 14 వరకూ వేడుకగా ధనుర్మాస ఉత్సవాలు
- కన్నులపండువగా జరుగనున్న గోదా - రంగనాథుల పరిణయం
- జిల్లాలో వైష్ణవాలయాల్లో మార్మోగనున్న తిరుప్పావై ప్రవచనాలు

సత్తుపల్లి, డిసెంబర్ 15 : పరమపవిత్రమైన ధనుర్మాసం ఈ నెల 17 నుంచి ప్రారంభం కానుంది. సంక్రాంతికి నెల ముందు నుంచి ధనుర్మాసం మొదలవుతుంది. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ఆరంభమవుతుంది. తిరిగి సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే సంక్రాంతి రోజుతో ముగుస్తుంది. ధనుర్మాసం ప్రారంభాన్ని పల్లెల్లో సంక్రాంతి నెల అని కూడా అంటారు. అందుకే ఇంతటి పవిత్రమైన ధనుర్మాసం కోసం కురువృద్ధుడు భీష్ముడు అంపశయ్యమీద ఉండి ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చే వరకు ఆగి అది వచ్చాకే మరణించారన్నది పురాణోక్తి.

భక్తవత్సలుడు శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనది ఈ ధనుర్మాసం. ఈ మాసంలో ఆ స్వామిని ఉద్దేశించి చేసే చిన్నపాటి పూజాదిక్రతువైన అక్షరు అమైపు సత్ఫలితాలను ప్రసాదిస్తున్న దివ్యోక్తి. ఈ మాస దివ్య ప్రభావం వల్ల గోదాదేవి సాక్షాత్తూ ఆ రంగనాయకుని పరిణయమాడింది అని పురాణాలు చెబుతున్నాయి. సాక్షాత్తూ భూదేవి అవతారమూర్తియిన ఆండాళ్లు రచించిన దివ్యప్రబంధమే తిరుప్పావై. తిరు అంటే మంగళకరమైన అని, పావై అంటే మేలుకొలుపు అని అర్థం.

ఈ మాసంలో విష్ణువును మధుసూదనుడు అనే పేరుతో పూజించి మొదటి 15 రోజులు చక్కెర పొంగలి లేదా పులగం స్వామికి నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత 15 రోజులు దధ్యోజనం అర్పించాలి. వెళ్లిడి యువతులు తమ ఇళ్ల ముంగిట ముగ్గులు, గొబ్బెమ్మలతో పూజలు చేయడం వల్ల కోరిన వరుడు లభిస్తాడని నమ్మకం. ఈ నెలలో ప్రతిరోజూ సూర్యోదయానికి ఐదు గడియలు ముందుగా నిద్రలేచి తలస్నానం చేసి సంధ్యావందనాలు ముగించి ధనుర్మాస వ్రతాన్ని ఆచరించాలని పురాణాలు చెబుతున్నాయి. ఈ నెల రోజులు హరిదాసుల కీర్తనలతో, జంగమదేవరులతో, గంగిరెద్దుల ఆటపాటలతో సందడిగా ఉంటుంది. పందిళ్లలో ముత్యాల ముగ్గులు కనువిందుగా చేస్తుంటాయి. ధాన్యపు రాశులను ఇళ్లకు చేర్చిన రైతులు.. సంబరాలతో సంక్రాంతి పండుగ కోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఈ ధనుర్మాస ఉదయ సంధ్యల్లో ఇళ్లు శుభ్రం చేసి దీపారాధన చేయడం వల్ల మహాలక్ష్మి అనుగ్రహిస్తుందని నమ్మకం.

మానవజన్మ దేవదేవుని ప్రాప్తి కోసం నిర్దేశితమైంది. ఆ భగవత్‌ప్రాప్తి కోసం భూమిపైనే భక్తి, ప్రవృత్తి, ఆరాధన, ఆర్తి కలగలిపి సేవిస్తే భగవంతుడు మానవులకు ప్రాప్తిస్తాడని నమ్మకం. ఈ అనుభవాన్ని సర్వవ్యాప్తం చేయడమే ధనుర్మాస వ్రత ఉద్దేశం. ఈ మాసంలో ఆండాల్ బాహ్యాను అనుభవంతో, అంతరానుభవంతో 30 రోజులు ఆధ్యాత్మికత చెందుతూ పాశురాలను ధ్యానం చేస్తే సత్సంగం వల్ల భగవత్ సంకల్పం ప్రాప్తిస్తుందని ఈ పాశురాల ద్వారా నిరూపితమైంది. తిరుప్పావై అంటే శ్రీవ్రతం. ఈ వ్రతాన్ని తిరునోము అంటారు. మార్గశిర మాసంలో ధనురాశిలో సూర్యుడు ప్రవేశించి మకరరాశిలోకి సాగే కాలాన్ని ధనుర్మాసం అంటారు. మార్గం అంటే దారి లేదా ఉపాయం. శీర్షం అంటే శిరం. మార్గశిరం అంటే భగవత్‌ప్రాప్తిని కలిగించే శ్రేష్ఠమైన మార్గం. ఈ నమ్మకాన్ని పెంపొందించే వ్రతమే ధనుర్మాసం. ఈ ధనుర్మాసంలో గోదాదేవి తన పాశురాలను గానం చేసి దైవాన్ని చేరింది. ఈ నెల 17 నుంచి ధనుర్మాసం ప్రారంభమై జనవరి 14న గోదాదేవి కల్యాణంతో పరిసమాప్తమవుతుంది. గోదాదేవి ఆచరించిన తిరుప్పావై వ్రతం ద్వారా భక్తులు తాము కోరిన కోర్కెలను తీర్చుకోవచ్చున్నది ప్రతీతి. ఈ ప్రకారంగానే గోదాదేవి తిరుప్పావై వ్రతాన్ని ఆచరించి శ్రీరంగ క్షేత్రానికి వెళ్లి శ్రీరంగనాథుని చెంతకు చేరి విగ్రహరూపాన్ని పొందింది. ఇది శ్రీవైష్ణవ సంప్రదాయంలో అద్భుతమైన వ్రతం. పరమాత్మున్ని పొందడానికి ఎక్కడో వెళ్లాల్సిన అవసరంలేదని, మన ఆరాధనలు అందుకోవడానికి వచ్చిన అద్భుతరూపం ఆ విగ్రహమని, పరమాత్మున్ని విశ్వసించి మనం ఏది కోరినా అది పొందవచ్చని గోదాదేవి నిరూపించిందన్నది పురాణోక్తి.

ధనుర్మాసం సకల శ్రేష్ఠం.

ధనుర్మాసం అంటేనే పరమపవిత్రమైన మాసం అని అర్థం. ఈ నెల రోజులు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 14 వరకు ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు, గోదాదేవి పాశురాలు చేయడం ఆనవాయితీ. ఈ నెల రోజులు గోదాదేవి చరిత్రను తెలుసుకుంటూ పూజలు చేయడం ద్వారా ఆ దేవదేవుడు మనకు అంతఃకరణ శుద్ధిని ప్రసాదిస్తాడని నమ్మకం. తద్వారా భక్తిపారవశ్యం పొందుతూ ఆ శేషవనామాలు వింటూ తరించడం భక్తకోటికి మంగళకరం.

–శ్రీమాన్ రామకృష్ణమాచార్యులు,
ప్రముఖ ప్రవచనకర్త, సత్తుపల్లి

- మూడో రోజుకు చేరిన ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు
- స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు
- రామయ్యను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు
- అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వరాహావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రాద్రి రామయ్య

వరాహావతారంలో వైకుంఠ రాముడు

భద్రాచలం, డిసెంబర్ 15 : భద్రాద్రి దివ్యక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగుతున్నాయి. సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైకుంఠ రాముడు వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని పరవశించిపోయారు. ఉదయం బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు, నిత్య కల్యాణ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేసి అర్చనలు చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులను అంతరాలయంలోనికి తీసుకెళ్లి వరాహావతారంగా అలంకరించారు. పూజలు నిర్వహించి బేడా మండపానికి తీసుకొచ్చి ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన తదితర కార్యక్రమాలు జరిపారు. స్వామివారికి నాళాయిర దివ్య ప్రబంధంలోని 200 పాశురాలు విన్నవించి.. వేద పారాయణం, వేద విన్నపాలు చేసి భక్తులు దర్శించుకునేందుకు మండపంలో స్వామివారిని వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారిని సమస్త మంగళ వాయిద్యాలు, వేద పారాయణాలతో ప్రత్యేక పల్లకిలో గోదావరి తీరానికి తీసుకెళ్లి హారతులు సమర్పించారు. ఆ తర్వాత మిథిలా స్టేడియానికి స్వామివారిని తీసుకెళ్లి ప్రత్యేక వేదికపై వేంచేపు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి వరాహరూపంలో ఉన్న రామయ్యను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారికి తాతగుడి సెంటర్ వరకు వీలుగా బేడా మండపంలో స్వామివారిని వేంచేపు చేశారు. అనంతరం స్వామివారికి సమస్త మంగళ వాయిద్యాలు, వేద పారాయణాలతో ప్రత్యేక పల్లకిలో గోదావరి తీరానికి తీసుకెళ్లి హారతులు సమర్పించారు. ఆ తర్వాత మిథిలా స్టేడియానికి స్వామివారిని తీసుకెళ్లి ప్రత్యేక వేదికపై వేంచేపు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి వరాహరూపంలో ఉన్న రామయ్యను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారికి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. తర్వాత స్వామివారిని ఆలయానికి తీసుకొచ్చి దర్బార్ సేవ నిర్వహించారు. మిథిలా స్టేడియంలో నిర్వహిస్తున్న కూచిపూడి నృత్యాలు, హరికథలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులమధిని దోచాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి, ప్రధానార్చకులు పాడి చేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఈతః రవీందర్‌రాజు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, నిరంజన్‌కుమార్, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలం రామాలయంలో క్యూలో ఉన్న భక్తులు

పర్ణశాలలో..

పర్ణశాల రామయ్య

పర్ణశాల, డిసెంబర్ 15 : ముక్కోటి అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామాలయంలో మూడో రోజు శుక్రవారం వరాహావతారంలో రామయ్య భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని అలంకరించిన అర్చకులు ఈ అవతారంపై భక్తులకు వివరించారు. ఈ రూపంలో ఉన్న స్వామివారిని రాహుగ్రహ బాధలు ఉన్న వారు దర్శించుకుంటే విముక్తులవుతారని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శేషకిరణ్ కుమార్ చార్యులు, అమరవాది శ్రీకాంత్ చార్యులు, భరద్వాజా చార్యులు, రాజగోపాల్ చార్యులు, నరసింహాచార్యులు, ఏతమో త్రావణ్‌కుమార్, అనిల్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

మిగ్‌జాం తుపాన్ విధ్వంసం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.600 కోట్ల నష్టం

ఉన్నతాధికారులకు నివేదిక అందజేసిన వ్యవసాయ శాఖ

పరిహారం, సాయం కోసం అన్నదాతల ఎదురుచూపు

ఖమ్మం, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :కొద్ది రోజుల క్రితం తీరం దాటిన మిగ్‌జాం తుపాన్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ విధ్వంసం సృష్టించింది. అప్పట్లో ముూడురోజులుపాటు విస్తారంగా వర్షాలు కురవడంతో కల్లాల వద్ద ఉన్న పంటలతోపాటు, కోతకు వచ్చిన పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా దాదాపు గా 83 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టపాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు నివేదికను సిద్ధం చేశారు. ఇందులో 53 వేల మంది రైతులకు తీవ్రనష్టం వాటిల్లినట్లు తేలింది. ఇక భద్రాద్రి జిల్లాలోనూ మరో 60 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అక్కడి వ్యవసాయ శాఖ అధికారులు కొద్ది రోజుల క్రితమే ప్రాథమిక నివేదికను రూపొందించారు. అనంతరం పూర్తి వివరాలతో మరో నివేదికను సిద్ధం చేశారు. తుది నివేదిక ప్రకారం ఖమ్మం జిల్లాలో 39,926 మంది రైతులకు చెందిన వరి పంట 55,522 ఎకరాల్లో, 2,232 మంది రైతులకు చెందిన మక్క పంట 3,938 ఎకరాల్లో, ఒక రైతుకు సంబంధించి మిను ము పంట 2 ఎకరాల్లో దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లాలో 5,298 రైతులకు చెందిన వరి పంట 8,816 ఎకరాల్లో, 323 మంది రైతులకు చెందిన మక్క పంట 585 ఎకరాల్లో, 464 మంది రైతులకు చెందిన వేరుశనగ పంట 1,607 ఎకరాల్లో, 1,285 మంది రైతులకు చెందిన మిర్చి పంట 2,475 ఎకరాల్లో, 80 మంది రైతులకు చెందిన పత్తి పంట 130 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతిన్నాయి. మొత్తంగా ఖమ్మం జిల్లా రైతులకు సుమారుగా రూ.490 కోట్లు, భద్రాద్రి జిల్లా రైతులకు సుమారుగా మరో రూ.110 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. వానాకాలం సాగు చేసిన పంటల్లో కేవలం పెసర పంట మాత్రమే ఇప్పటికే చేతికి వచ్చినట్లయింది. వరి పంట కొంతమేర చేతికొచ్చింది. మిగిలిన వరి పంటతోపాటు పత్తి, మిర్చి పంటలు పొలాల్లో ఉండగానే తుపాన్ రావడంతో ఆ పంటలన్నీ నాణ్యత కోల్పోయాయి. దీంతో మార్కెట్‌లో వాటి ధరలు కూడా తగ్గిపోయాయి. కోతకు వచ్చిన వరి పూర్తిగా నేల వాలడంతో రైతులు ఇప్పటికీ ఆందోళనలోనే ఉన్నారు. కల్లాల వద్ద ఉంచిన పంట కూడా పూర్తిగా తడిసిముద్దయింది.

సర్కారు సాయం కోసం రైతుల చూపు..

చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో అన్నదాతల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాము ఆరుగాలం కష్టించి పంటను చేతికి తెచ్చుకుంటే ప్రకృతి తమకు తీరని నష్టం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ తగిన న్యాయం చేయాలని, పరిహారం గానీ, సాయంగానీ అందించాలని కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616